# కాంపన్సేషన్

**పాలంకి సత్య**



**ఆడపిల్లలు చదువుకోడవే అపురూపమైన రోజుల్లో అమృతవల్లిని తండ్రి మాథమేటిక్స్‌లో ఎమ్.ఎస్‌సి. చదివించాడు. ఉమెన్స్ కాలేజిలో లెక్చరరుగా చేరింది. తోటి లెక్చరరు అయిన నందనరావుని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. కులాంతరమైనా, తల్లిదండ్రులు ఆమోదించారు. నందనరావు సైకాలజీ లెక్చరరు. గుణవంతుడు. వారికి అభ్యంతరం కన్పించలేదు.**

అమృతవల్లికి మాత్రం అసంతృప్తి. మాథమేటిక్స్‌లో ఆమెవి అత్తెసరు మార్కులే. ఆడపిల్లలు ఎక్కువగా చదువుకోని రోజులు కాబట్టీ, ఈనాటి కాంపిటిషన్ లేదు కాబట్టీ ఆమెకు సీటు వచ్చి, చదువు సులువుగా సాగింది. అయినప్పటికీ, తనని ఇంజనీరింగ్ చదివించలేదని ఆమెకు తండ్రిపై కోపం. అన్నయ్యకు ఇంజనీరింగ్ చెప్పించారు, నాకు చెప్పించారా అని అడుగుతూ ఉండేది. కనీసం ఇంజనీరు భర్తనైనా తెచ్చారా అనేది!

నీది ప్రేమ వివాహం అనే ధైర్యం తండ్రికి లేదు. ఆ మాటే అంటే నేను ప్రేమించి పెళ్లి చేసుకోకపోతే, మీరు కట్నానికి చూసుకుని నాకు పెళ్లే చెయ్యరు అని యాగీ చెయ్యగల సత్తా అమృతవల్లి'కుంది.

తండ్రి మాట్లాడేవాడు కాదు. అమృతవల్లిలో అసంతృప్తి ఆకాశం ఎత్తుకు ఎదిగిపోయింది.

* * *

అందరిలాగే ఒక పిల్లా, పిల్లాడూ పుట్టగానే ఫుల్‌స్టాప్ పెట్టారు అమృతవల్లి దంపతులు.

ఆడపిల్లపై ఆశలు పెంచుకుంది అమృతవల్లి. అబ్బాయి చదువుని అంతగా పట్టించుకోలేదు.

"పాపా! నువ్వు ఇంజనీరింగ్ చదివి పెద్ద కంపెనీలో పని చెయ్యాలి" అనేది.

పాపకే చెప్పినా, అమృతవల్లి కొడుకు ఆ మాటలు పట్టించుకున్నాడు. అతనికి ఐ.ఐ.టి.లో సీటు వచ్చింది.

అమృతవల్లి కూతురు హైమ కూడా చాలా



## నైమిశం

**నీలంరాజు లక్ష్మీ ప్రసాద్**

# అభియోగం చేయని మహనీయులు

పూర్వపు జపాన్‌లో షిచిరీ అనే జెన్ సాధకుడు బౌద్ధ సూత్రాలను వల్లెవేస్తూ నిష్ఠగా ఒకచోట కూచున్నాడు. ఆ సమయాన ఓ దోపిడీ దొంగ గదిలోనికి ప్రవేశించి షిచిరీ మెడపై కత్తి మోపి "నీ వద్దనున్న ధనమంతా ఇచ్చెయ్యి" మని హుంకరించాడు.

షిచిరీ కూచున్న ఆసనం నుండి కదలకుండా "అదుగో ఆ బల్లమీద పెట్టెలో ఉన్నది" అని ఆ దొంగకు సమాధానం చెప్పి, తన జపాన్ని కొనసాగిస్తూ ఉండిపోయాడు.

దొంగ ఆ డబ్బు తీసుకుని వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడవుతుండగా, షిచిరీ కూచున్న చోటినుండి లేవకుండానే "ప్రభుత్వ పన్నుల అధికార్లకు కట్టడానికి కొంత డబ్బు ఉంచి వెళ్ళు. వాళ్ళు రేపు ఇటు వస్తామని చెప్పి వెళ్ళారు" అన్నాడు.

దొంగ సరేనంటూ కొంత డబ్బుఆపెట్టెలోనే ఉంచేసి మిగతాది పట్టుకొని బయలుదేరాడు.

"నీకెవరైనా ఏదైనా బహూకరిస్తే వారికి థాంక్స్ చెప్పవా?" అని అడిగాడు షిచిరీ దొంగని.

ఈ వింత సంభాషణకు ఆ దొంగ లోలోన నవ్వుకొని థాంక్స్ అంటూ వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళయిం తరువాత ప్రభుత్వంవారు ఆ దొంగను పట్టుకున్నారు. తాను చేసిన మగతా అన్ని దొంగతనాలతో బాటు సాధకుడు షిచిరీ ఇంట కూడా డబ్బు దోచానని చెప్పుకున్నాడు ఆ దొంగ.

ప్రభుత్వాధికారులు షిచిరీతో ఈ విషయం ప్రస్తావించినపుడు,"నే నా దొంగపై అభియోగం చేయదలచడం లేదు. నేను అతడికి కొంత డబ్బు బహుమానంగా ఇచ్చాను. అతడు నన్ను థాంక్స్ చేశాడు కూడాను. జరిగిన దంతే" అని చెప్పాడు.

ఆ దొంగ తన కారాగార శిక్షానంతరం, నేరుగా షిచిరీ వద్దకు వెళ్ళి, "మీరే నా గురువు, నన్ను మీ శిష్యునిగా స్వీకరించండి" అన్నాడు.

ఈ శతాబ్దం ప్రథమార్ధంలో తిరువణ్ణామలైలో జీవించి తరించిన అరుణాచల రమణుడు 1924లో ఆశ్రమంలోకి జొరబడ్డ దోపిడీ దొంగల చేతుల్లో మిగతా వారితోబాటు తానూ దెబ్బలు తిన్నాడు. "మీ ఇష్టమొచ్చినవి తీసుకువెళ్ళండి" అని దొంగలకు చెప్పి రమణుడు, మిగతా శిష్యులు ఆశ్రమం హాలుకు ఉత్తరాన ఉన్న తాటాకుల షెడ్‌లో కూర్చున్నారు. 'మీరంతా వెళ్ళి మీ గాయాలకు ఏదైనా మందు రాసుకోం"డని రమణుడు సలహా ఇవ్వగా, రామకృష్ణస్వామి అనే శిష్యుడు-"మరి మీ సంగతేమిటి?'అని అడగగా, రమణుడు నవ్వుతూ, "నాకు కూడా కాస్త పూజ జరిగిం" దని తొడమీద తగిలిన దెబ్బ, ఆ వాపు చూపించాడు. శిష్యుడు కోపం పట్టలేక అక్కడే ఉన్న గడ్డపార తీసుకుని, వాళ్ళ సంగతి తేలుస్తానంటూ లేచాడు.

రమణుడు అతడ్ని వారిస్తూ "మనం సాధువులం, రామకృష్ణా! మన ధర్మం మనం వదిలేస్తే ఎలా? నువ్వు తీరా దీనితో వారినెవరినైనా ఒకటి వేస్తావనుకో, అతడు చనిపోతే సహజంగా లోకం మన ధర్మ ప్రవర్తననే నిందిస్తుంది. అజ్ఞానం ఆ దొంగల కళ్లు కప్పినందువల్ల వాళ్ళట్లా ప్రవర్తిస్తున్నారు. కానీ మన ధర్మమేమిటో మనం గుర్తించి వర్తించాలి కదా? నీ నోట్లోని దంతాలు హఠాత్తుగా నీ నాలికను కొరికితే, కోపం వచ్చి నీ పళ్లన్నీ ఊడగొట్టుకుంటావా? అన్నాడు.

తర్వాతి రోజుల్లో పోలీసులు వచ్చి, "కొందరు దొంగల్ని పట్టుకున్నాం, పేరేడ్ పెట్టదలుచుకున్నాం. మీ ఆశ్రమంలోకి వచ్చిన దొంగల్ని మీరు గుర్తించగలరా?" అని శ్రీ రమణుల వారిని అడిగితే - "మాకు ఈ కర్మ యావత్తూ ఎందుకు సంభవించిందో సరిగా గుర్తించలేకుండా ఉన్నాను. మధ్యలో ఆ దొంగల్ని గుర్తించడం కూడానా?" అని తిరస్కరించాడు రమణుడు. ఆ దొంగలపై అభియోగం తీసుకురావడం ఆ మహనీయునికి మనస్కరించలేదు.

---

బాగా చదివేది. టెన్త్ క్లాసులో మంచి మార్కులతో పాసయి ఇంటర్మీడియెట్‌లో చేరింది.

అమృతవల్లికి నిద్రాహారాలు లేవు. కూతురికి ఇంజనీరింగ్‌లో సీటు రావాలి. రెండు, మూడు ఇన్‌స్టిట్యూట్స్ నుంచి పోస్టల్ కోచింగ్ తెప్పించింది. ఊళ్లోని బెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించింది.

భర్త కొద్దిగా అభ్యంతరం చెప్పాడు-'అమ్మాయి సుకుమారి. ఇంజనీరింగ్ కన్నా మామూలు డిగ్రీ చదివించినా సరిపోతుంది; ఐ.ఎ.ఎస్.కి పంపిద్దాం.'

"మీ ఆలోచనలు అలాగే ఉంటాయి. అసలు మాథమేటిక్స్ చదివితే కదా మీకు ఇంజనీరింగ్ అంటే ఏమిటో తెలియడానికి? నా కూతురు విషయం నేను చూసుకుంటాను" అంటూ భర్తని మాట్లాడకుండా ఆపింది అమృతవల్లి.

"హైమ ఇష్టం కనుక్కున్నావా?" అని అడిగిన తండ్రితో-"నా ఇష్టం అడిగే నన్ను చదివించారా? ఆడపిల్లని కదా అని ఇంజనీరింగ్ చెప్పించలేదు. నాకు జరిగిన అన్యాయం నా కూతురికి జరగడానికి వీల్లేదు"అంది.

నందనరావు భార్యతో "అమృతా! నువ్వు పొరబడుతున్నావు. ఇంజనీరింగ్ చదవాలన్నది నీ కోరిక. నీకు తీరని కోరికను నువ్వు అమ్మాయి నెత్తి మీద రుద్దేస్తున్నావు. ఇలా తల్లిదండ్రులు తమకు తీరని కోరికలను పిల్లల మీద రుద్దెయ్యడాన్నే కాంపన్సేషన్ టెక్నిక్ ఇన్ డిఫెన్స్ మెకానిజం అని మా సైకాలజిస్టులంటారు. అమ్మాయి అభిప్రాయం అడుగుదాం" అన్నాడు.

"మీ బోడి సైకాలజీ నా దగ్గర చెప్పద్దు. కావలిస్తే అమ్మాయిని అడుగుదాం. హైమా! ఏం చదువుతావు?" అంది అమృతవల్లి.

"నీ ఇష్టం మమ్మీ" అంది హైమ.

అమృతవల్లి గర్వంగా తల ఎగరేసి "నా ఆశలన్నీ నీ మీదే పెట్టుకున్నాను... నువ్వు పెద్ద ఇంజనీరువి కావాలి" అంది.

రోజా ట్యూషన్లతో పాటుగా తల్లి ఆశలు వినడానికి కొంత టైం కేటాయించింది హైమ.

పరీక్షలు దగ్గర పడ్డ కొద్దీ ఆమె గుండెలలో రైళ్లు పరిగెత్తసాగాయి. తల్లి తన మీద ఎన్ని ఆశలు పెట్టుకుంది. తను నిజంగా ఎంట్రెన్స్ పాసవగలదా? ఇంజనీరు అవుతుందా?

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ముందు రాత్రి పన్నెండు గంటలదాకా హైమ చేత మోడల్ పేపర్స్ చేయించింది అమృతవల్లి. మర్నాడు పొద్దుట అయిదు గంటలకే నిద్ర లేపింది.

పరీక్షహాల్లోకి వెడుతున్నప్పుడు కూడా 'నా ఆశలన్నీ నీ మీదే పాపా! నువ్వు ఇంజనీరు కావాలి' అంది.

క్వశ్చన్ పేపర్ చూస్తున్న హైమ మనస్సులో ఒక్కటే ప్రశ్న. తల్లి ఆశలు తను తీర్చగలదా?

ఆ ప్రశ్న తప్ప ఆమెకు పేపర్‌లోని ప్రశ్నలు కన్పించలేదు.

ఆమె కలం కదలకుండా ఆగిపోయింది.

ఇంకా చెప్పాలంటే ఆమె జీవితమే ముందుకు వెళ్లకుండా ఆగిపోయింది.